నిజం మా లక్ష్యం.. ప్రజలే మా బలం..

Tel Tel 2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక Telugu Daily News Paper | vastavatelangana@gmail.com | www.vastavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ

అఫీస్ అడ్రస్ : గుమ్మడిడల గ్రామం & మండలం జిల్లా సంగారెడ్డి

RNI No : TELTEL/2022/81794

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 | సంచిక: 68 | గురువారం, 06 ఆగస్టు, 2026 | పేజీలు -4 | వెల : 3/-

C2 TELANGANA CHANNEL

వాస్తవ తెలంగాణ లో
పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా

రిపోర్టర్స్ కావలెను

అర్హత 10th / Degree
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం
తెలంగాణ వ్యాప్తంగా అవకాశం

సంప్రదించవలసిన నెంబర్ :
8499902850

నిజాయతీ కలిగిన వారికి మంచి అవకాశం

# పెద్ది సంస్మరణ సభకు కేసీఆర్



వాస్తవ తెలంగాణ

## ఈ నెల 9న నల్లబెల్లికి పయనం

- పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పరామర్శ
- 9, 10 తేదీల్లో దివంగత మాజీ ఎమ్మెల్యే సంస్మరణ సభలు
- 9న కేటీఆర్, 10న హరీష్‌రావు హాజరు
- పెద్ద ఎత్తున తరలిరానున్న బీఆర్ఎస్ శ్రేణులు

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ఈ నెల 9వ తేదీన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలానికి రానున్నారు. ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేయనున్నారు. దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి జ్ఞాపకార్థం ఈ నెల 9, 10 తేదీల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సంస్మరణ సభలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు పార్టీ అగ్రనేతలు హాజరుకానున్నారు. ఈ నెల 9వ తేదీన జరిగే సంస్మరణ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించనుండగా, 10వ తేదీన జరిగే కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొని దివంగత నేతకు నివాళులర్పించనున్నారు.

### కేసీఆర్ పర్యటనకు కోసం ఏర్పాట్లు..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పర్యటన నేపథ్యంలో నల్లబెల్లి పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండటంతో సభ విజయవంతం చేసేందుకు జిల్లా నాయకత్వం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. పెద్ది సుదర్శన్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కీలక నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన మరణం బీఆర్ఎస్‌కు తీరని లోటుగా పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ స్వయంగా నల్లబెల్లికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించడం, సంస్మరణ కార్యక్రమాలకు పార్టీ అగ్రనేతలను పంపించడం రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.



# సాగునీరుపై.. ఏపీ కుట్ర



## జీఆర్ఎంబీ అజెండానే నిదర్శనం

- తెలంగాణ ప్రాజెక్ట్ అనుమతులు రద్దు కోరడం అన్యాయం
- కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం ఎందుకు?
- నీటి హక్కులను తాకట్టు పెడుతున్నారా?
- రేవంత్ రెడ్డి సర్కార్ మౌనంపై హరీష్ రావు ఆగ్రహం
- వెంటనే ఆ అజెండా రద్దు చేయాలని డిమాండ్
- నీటి విషయంలో అన్యాయం జరిగితే సహించబోము
- తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే ఉద్యమం

ఈ నెల 18న జరగనున్న గోదావరి నది నిర్వహణ బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం ఎజెండాలో తెలంగాణకు సంబంధించిన కీలక సాగునీటి ప్రాజెక్టుల అనుమతులను పునఃసమీక్షించే అంశాన్ని చేర్చడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందిన ప్రాజెక్టులను సమీక్షించి నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరడం తెలంగాణ ప్రయోజనాలపై ప్రత్యక్ష దాడి అని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు, కాళేశ్వరం, చిన్న కాళేశ్వరం, చౌటుపల్లి హన్మంతరావు, చనాకా-కొరటా, మోదికుంట వాగు, కడెం గూడెం లిఫ్ట్, సీతారామ లిఫ్ట్, సమ్మక్క బ్యారేజీ వంటి ప్రాజెక్టులకు ఇప్పటికే లభించిన అనుమతులను రద్దు చేయాలని ఏపీ కోరుతోందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం సాధించిన 383 టీఎంసీల గోదావరి జలాల వినియోగ అనుమతులను ప్రశ్నించడం తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు.

వాస్తవ తెలంగాణ

### రేవంత్ ప్రభుత్వం స్పందించకపోవడం ఏంటి?

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు ఈ అంశంపై స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందని, రాష్ట్ర ప్రయోజనాల కంటే ఏపీ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణకు తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి తీసుకురాలేదని, సమ్మక్క, పాలమూరు, వార్ధా ప్రాజెక్టుల డీపీఆర్‌లు కూడా తిరిగి వచ్చాయని ఆరోపించారు. గత ప్రభుత్వం సాధించిన అనుమతులను కూడా కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చిందని విమర్శించారు.

### తెలంగాణకు హక్కుల్లేవని ఏపీ ఎజెండాలో..

తెలంగాణకు గోదావరిలో 968 టీఎంసీల హక్కు లేదని ఏపీ ఎజెండాలో పేర్కొనడం అత్యంత ప్రమాదకరమని, అయితే రాష్ట్రపునర్వ్యవస్థీకరణ ప్రక్రియతో పాటు గత జీఆర్ఎంబీ సమావేశాల నిర్ణయాల్లో తెలంగాణ హక్కులు స్పష్టంగా నమోదయ్యాయని గుర్తు చేశారు. ఇప్పటికే కేంద్రం ఆమోదించిన ప్రాజెక్టులను జీఆర్ఎంబీ తిరిగి సమీక్షించే అధికారం లేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు ఈ అంశంపై వెంటనే స్పందించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసే జీఆర్ఎంబీ ఎజెండాను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# కేంద్రం కోర్టులో తుమ్మడిహట్టి

- మహారాష్ట్రతో చర్చించేందుకు చొరవ చూపాలన్న రేవంత్ రెడ్డి
- కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ
- 150 మీటర్ల ఎత్తులో ప్రాజెక్ట్ నిర్మిస్తామని ప్రతిపాదన



**హైదరాబాద్,** వాస్తవ తెలంగాణ గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన తుమ్మడిహట్టి ప్రాజెక్ట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కోరారు.. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించేందుకు కేంద్రం చొరవ చూపాలని అన్నారు.. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బుధవారం కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పలువురు ఎంపీలు పాల్గొన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో అత్యంత కీలకమైన తుమ్మిడి హెట్టి బ్యారేజీ నిర్మాణ ఎత్తు విషయమై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు.

# త్వరలో అందుబాటులోకి సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి

- అజారుద్దీన్‌తో కలిసి నిర్మాణ పనులు పరిశీలించిన పొన్నం

**హైదరాబాద్,** వాస్తవ తెలంగాణ సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభించి నగరవాసులకు అందుబాటులోకి తీసుకొస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం మంత్రి అజారుద్దీన్‌తో కలిసి సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి, మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సుమారు రూ.680 కోట్ల వ్యయంతో సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. చంచల్‌గూడ జైలు నుంచి ఒవైసీ ఆసుపత్రి వరకు, మరోవైపు చంపాపేటకు అనుసంధానంగా ఈ బ్రిడ్జిని నిర్మించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే ఈ బ్రిడ్జిని ప్రారంభిస్తారని వెల్లడించారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి ప్రారంభంతో సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని, ప్రజలకు ప్రయాణ సౌలభ్యం మెరుగుపడుతుందని మంత్రి పేర్కొన్నారు. అలాగే, మూసారాంబాగ్ బ్రిడ్జిని కూడా త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మరోవైపు కేబీఆర్ పార్క్ సమీపంలోని బ్రిడ్జి పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అభివృద్ధి పనుల అమలులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# చేనేత సంఘ చైర్మన్ కు సన్మానం



నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన చేనేత సంఘం చైర్మన్ ముత్యాల సాయిలు డైరెక్టర్లను హనుమంతరావుపేట పద్మశాలి కుల బాంధవులు, పెద్దలు,నారాయణఖేడ్ పద్మశాలి సంఘం బాధ్యులు, పెద్దలు, బుధవారం హనుమంతరావు పేటలోని సొసైటీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన చైర్మన్ డైరెక్టర్లు చేనేత సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని చెప్పారు. అనంతరం చైర్మన్ ముత్యాల సాయిలు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా చైర్మన్ గా ఎన్నుకున్నందుకు సంస్థ చేనేత సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో హనుమంతరావుపేట్ లింగాపూర్ సర్పంచులు రాజు తులసి బాయ్, అన్నల్దేసి హనుమాన్లు, పద్మశాలి నారాయణఖేడ్ అధ్యక్షులు గున్నాల నర్సింలు, కోశాధికారి చిప్ప అనంతం, సోమ విఠల్,గోస్కే ప్రకాష్,నారాయణ, సాయిలు,బశెట్టి,కేశవులు, జనార్ధన్, సుదర్శన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాగారం రాజ్ సుఖ్ కాలనీ లో 8లక్షలతో రోడ్డు పనుల ప్రారంభం లో భూమయ్య యాదవ్.. డివిజన్ నాయకులు.. శ్రీనివాస్ రెడ్డి,జీవన్ రెడ్డి



ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఘట్కేసర్ సర్కిల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం, మేడ్చల్ ఇన్‌చార్జ్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సహకారంతో నాగారం డివిజన్ పరిధిలోని రాసుఖ్ నగర్లో రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన కార్యక్రమం ప్రారంభం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్, మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి, మాదిరెడ్డి వెంకట్ రెడ్డి, సతీష్ గౌడ్ ,మాజీ కౌన్సిలర్ హరిబాబు, అరిగె రాములు,గండి శ్రీశైలం, బాల్‌రాజ్ యాదవ్ , కాలనీ అధ్యక్షులు దాసు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాసుఖ్ నగర్ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు.

# భూభారతి చట్టంపై పూర్తి అవగాహన పెంచుకోవాలి

**రెవెన్యూ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్**



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్ :-** భూభారతి చట్టంపై రెవెన్యూ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని మెదక్ జిల్లా డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ సిబ్బందికి నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు.రెవెన్యూ శాఖలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లు కీలక బాధ్యతలు నిర్వహిస్తారని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చట్టంలోని నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం భూ రికార్డుల నిర్వహణను పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు గత వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు తీసుకొచ్చిన సమగ్ర నూతన రెవెన్యూ భూ హక్కుల చట్టమే భూభారతి చట్టం అని తెలిపారు.భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. భూభారతి చట్టం అమలులో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.వర్క్‌షాప్‌లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# "ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా పనిచేసే నాయకులు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ....




**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సూరారం డివిజన్ కు చెందిన ఇద్దరు నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను బుధవారం చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దరఖాస్తుదార కుటుంబసభ్యులకు అందజేశారు.

**ఎల్వోసీ మంజూరు లబ్ధిదారుల వివరాలు :-**

129 - జీడిమెట్ల డివిజన్ సంజయ్ గాంధీ నగర్ కు చెందిన రాజేంద్రన్ దివ్యాన తండ్రి శ్రీధరన్ రాజేంద్రన్ (రూ.2,75,000/- లక్షలు).. 129 - జీడిమెట్ల డివిజన్ విశ్వకర్మ కాలనీ అశోక్ కుమార్ పండిత్ తండ్రి సీతారామ్ పండిత్ (రూ.3,50,000/- లక్షలు).. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, సీనియర్ నాయకులు కొండకల్లా శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జీవన్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఒకరి పేరు ఒకరి చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్న జిహెచ్ఎంసి & వాటర్ బోర్డు అధికారులు......

**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వాజ్పాయ్ నగర్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్ల నిర్మాణ పనులు బస్తీవాసులకు శాపంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై భారీగా వరదనీరు నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో నివసిస్తున్న మధ్యతరగతి కుటుంబాలు నిత్యజీవితాన్ని కొనసాగించడమే కష్టసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. సీఎంసీ అధికారులు నెలల క్రితం రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ కేవలం కొన్ని గల్లీల్లో మాత్రమే పనులు పూర్తి చేసి, మిగిలిన వీధులను అర్ధాంతరంగా వదిలేయడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పలు గల్లీలు చెరువులను తలపించేలా మారాయి. ఇక ఇప్పటికే దెబ్బతిన్న డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవడంతో వర్షపు నీరు, మురుగునీరు కలిసి రోడ్లపైనే నిలిచిపోతోంది. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల విజృంభణ పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులు, ఉద్యోగులు ప్రతి రోజూ నీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు కూడా కాలనీలోకి రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని బస్తీవాసులు వాపోతున్నారు. అధికారులు ప్రారంభించిన అభివృద్ధి పనులను పూర్తిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించి, నిల్వ ఉన్న వరదనీటిని తొలగించాలని బస్తీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యాల కంటే నిర్లక్ష్యమే ముఖ్యమా? అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని



స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి..!



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ కాప్రా, మల్లాపూర్ ప్రాంతాలలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని పరమేశ్వర్‌రెడ్డి పలు కాలనీవాసులతో పాటు కలిసి ఉప్పల్ జోన్ (ఎంఎంసీ) పరిధిలోని పలు ప్రాంతాలలో అభివృద్ధి పనులకు నిధుల మంజూరు చేయాలని వినతిపత్రం అందచేశారు. కాప్రా, మల్లాపూర్, ఇతర ప్రాంతాల ప్రజల తరపున అత్యవసర అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేసి, పరిపాలనా అనుమతులు ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రిని పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ పనులతో రహదారి అనుసంధానాన్ని మెరుగుపరచడం, రోడ్డు భద్రతను పెంచడం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించడంతో పాటు సంబంధిత అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేశారు.

**పనుల వివరాలు..**

1. కాప్రా డివిజన్ పరిధిలోని గాంధీనగర్ కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణం, నాయక్ నగర్--బంజారా కాలనీ కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణం, సాయిబాబా నగర్ 'సి' కాలనీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు.
2. కాప్రా డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ మసీదు రోడ్డు నుండి డబుల్ బెడ్‌రూమ్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం; గాంధీనగర్ రేషన్ షాప్ నుండి హెచ్.నెం. 1-1-159/4 నుంచి 1-1-160 వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు.
3. కాప్రా డివిజన్ పరిధిలోని వంపుగూడలో ఐఓబీ బ్యాంకు లేన్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణం; వీఐపీ గోదాం నుండి వంపుగూడ ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు.
4. కాప్రా డివిజన్ పరిధిలోని యాదవ్ బస్తీ, కాప్రాలో సీసీ రోడ్డు; న్యూ గాంధీనగర్‌లో సీఎఎల్ పబ్లిక్ స్కూల్ లేన్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణ పనులు.
5. కాప్రా డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు.
6. కాప్రా డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో కల్వర్టు నిర్మాణ పనులు.
7. మల్లాపూర్ డివిజన్‌లో లక్ష్మీనగర్ కమ్యూనిటీ హాల్, న్యూ నరసింహ నగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు
8. మల్లాపూర్ డివిజన్‌లో పిట్టల బస్తీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు.

# నేటి నుంచి ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు

**- అన్ని సబ్సిడీ ఎరువులకు కొత్త డిజిటల్ విధానం అమలు.**

**- రైతులు అపోహలకు గురికావద్దు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్:-** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ఎఫ్ఎస్ (ఫ్రేమవర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ ) యాప్ ద్వారా గురువారం (ఆగస్టు 6) నుంచి అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలు నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఒక ప్రదర్శన ద్వారా తెలిపారు. రైతులకు నాణ్యమైన ఎరువులను సకాలంలో, పారదర్శకంగా అందించడంతో పాటు ఎరువుల పంపిణీ వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేయడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఇప్పటివరకు అమలులో ఉన్న యూరియా బుకింగ్ యాప్ ద్వారా ప్రధానంగా యూరియా విక్రయాలు మాత్రమే నమోదయ్యేవని, ఇకపై ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎన్‌పీకే కాంప్లెక్స్ సహా అన్ని సబ్సిడీ ఎరువుల విక్రయాలు నమోదు కానున్నాయని తెలిపారు. ఈ విధానం ద్వారా ఎరువుల కొనుగోలు, పంపిణీ, నిల్వలు, సబ్సిడీ, విక్రయాల పర్యవేక్షణ ఒకే వేదికపై జరుగుతుందని చెప్పారు. రైతులు ముందుగా తమ మొబైల్ నంబర్‌తో ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో నమోదు చేసుకుని, సాగు పంట, విస్తీర్ణం, అవసరమైన ఎరువుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. అనంతరం యాప్ రూపొందించే ప్రత్యేక క్యూ ఆర్ కోడ్‌ను ఎంపిక చేసిన ఎరువుల డీలర్‌కు చూపించగా, ధృవీకరణ



అనంతరం ఎరువులు అందజేస్తారని వివరించారు.ఈ విధానం వల్ల ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు అక్రమ నిల్వలు, బ్లాక్‌మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని, కేంద్ర సబ్సిడీ నిజమైన లబ్ధిదారులకు చేరుతుందని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా కొత్త విధానానికి సహకరించాలని కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)ని సంప్రదించాలని సూచించారు.జిల్లాలో ప్రస్తుతం రైతుల అవసరాలకు అనుగుణంగా 2,846 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైన మేరకే ఎరువులు కొనుగోలు చేసి వినియోగించుకోవాలని సూచించారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తమే రక్షణ

**నకిలీ స్టాక్ మార్కెట్, ఉద్యోగాల పేరుతో మోసాలకు జాగ్రత్త.**
**విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు.**




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్,టౌన్ :–** సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. జాతీయ 'సైబర్ జాగృత్ దివస్' సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా-- సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ప్రతిరోజూ సైబర్ మోసాలతో కోట్ల రూపాయలు ప్రజలు కోల్పోతున్నారని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో కనిపించే నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి ప్రకటనలను నమ్మవద్దని హెచ్చరించారు. మోసగాళ్లు ముందుగా వాట్సాప్ గ్రూపుల్లో చేర్చి, నకిలీ లాభాల స్క్రీన్‌షాట్లు చూపించి నమ్మకం కల్పించి, అనంతరం భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టించి మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితర పేర్లతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యోగం ఇచ్చే సంస్థ అభ్యర్థికి జీతం చెల్లిస్తుందే తప్ప, ఉద్యోగం ఇవ్వడానికి డబ్బులు అడగదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం, డెబిట్ కార్డు వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు, తప్పుడు ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడంతో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకుని తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులతో సైబర్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు సుభాష్ చంద్రబోస్, ప్రసన్నకుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. హుస్సేన్, అధ్యాపకులు, సైబర్ క్రైమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.50 లక్షల సీసీ రోడ్డుతో ఐదో వార్డుకు కొత్త రూపు

**ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కృషి ఫలితమే.**
**మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతు నరేష్‌గౌడ్.**






**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :–** మెదక్ పట్టణంలోని 5వ వార్డులో మెయిన్ రోడ్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మీదుగా అతి దారుణంగా ఉన్న రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ప్రత్యేక చొరవతో రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయని మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతు నరేష్‌గౌడ్ తెలిపారు. టీయూఎఫ్ఐడీసీ (ఏడీఎఫ్) నిధులతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులు దాదాపు 20 ఏళ్లుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పనిచేస్తున్నారని, ఈ రోడ్డు నిర్మాణంతో స్థానికుల రాకపోకలు సులభతరం కానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్ మామిళ్ల.ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు కానుగు భూపతి రాజ్, నాగిరెడ్డి, సిరిమల్లె శ్రీనివాస్, బుడ్డ.రాజు, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ జె నితిన్, మున్సిపల్ సిబ్బంది సత్యనారాయణస్వామి దేవాలయ పూజారి మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయాలి

**బీసీ సంఘాలు పెద్దఎత్తున తరలిరావాలి వీరప్పరి రమేష్‌గౌడ్**

**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్,టౌన్ :–** బీసీ సంఘాల ఐక్యతతోనే హక్కులు సాధ్యమవుతాయని, సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేసేందుకు బీసీ సంఘాలు పెద్దఎత్తున తరలిరావాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకుడు వీరప్పరి రమేష్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. ఈఆయన మాట్లాడుతూ.. బీసీ సంఘాలు కేవలం ఓటు బ్యాంకు కాదని, బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సముచిత భాగస్వామ్యం, రాజ్యాధికారం, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ లక్ష్య సాధన కోసం అన్ని బీసీ సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో నిర్వహించే సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంత బాటలు వేసిన తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ కలలు కన్నది కేవలం ప్రత్యేక రాష్ట్రం మాత్రమే కాదని, ప్రతి వర్గానికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం అందే తెలంగాణేనని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సంకల్ప సభ సామాజిక తెలంగాణ నిర్మాణానికి తొలి అడుగు అవుతుందని, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వీరప్పరి రమేష్‌గౌడ్ కోరారు.



# కాప్రా ఆఫీస్ లో బోనాల సంప్రదాయా కళా వైభవం..

**---వసుధైక కుటుంబంల కాప్రా ఆఫీస్ ప్రాంగణం..**



**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ కాప్రా సర్కిల్ కప్రా ఆఫీస్ లో అంగరంగ వైభవంగా తెలంగాణ సంప్రదాయా ప్రతిష్టాత్మకమైన బోనాల పండుగ ను కాప్రా ఆఫీస్ పూర్తి స్థాయిలో అన్ని సెక్షన్ అధికారులు, మహిళామణులు సంప్రదాయ వస్త్ర అలంకరణతో పోతరాజుల వేషాలు, డప్పు చప్పుళ్ళు, జోగినిల నెత్తిన బోనంతో యాటా పోతుల ను అమ్మవారికి సమర్పణలతో ఎంతో ఉత్సాహంగా, భక్తి పారవైశ్యం తో కాప్రా సర్కిల్ ఆఫీస్ మారుమ్రోగింది. కాప్రా సర్కిల్ ప్రజల యోగక్షేమాలను ఆకాంక్షిస్తూ ఉద్యోగుల ఉన్నతిని పెంపొందించాలని అమ్మవారిని కోరుకుంటూ కాప్రా సర్కిల్ కమిషనర్ ఆధ్వర్యంలో బిఎంఎస్ ఉద్యోగుల, మరియు ఆయా సెక్షన్ అధికారుల సమక్షంలో అంగరంగ వైభవంగా ఒక వసుదైక కుటుంబంలో కాప్రా సర్కిల్ ఆఫీసు పండుగ వాతావరణంతో బోనాల పండుగను జరుపుకున్నారు.

# సైబర్ నెలలపై మోకిలా పోలీసులు పోస్టర్లు విడుదల....





**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్ పల్లి మండలం మోకిలా గ్రామంలో బుధవారం నేషనల్ సైబర్ జాగ్రత్త క సందర్భంగా సైబర్ నెలలపై మోకిలా పోలీసులు పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమం ప్రాచీన్ గ్లోబల్ స్కూల్లో జరిగింది. సైబర్ నేరాలపై విద్యార్థులకు సీఐ శ్రీనివాస్ రెడ్డి అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్ గౌడ్, సిబ్బంది, పాఠశాల మేనేజ్మెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

# 80 కిలోల గంజాయి స్వాధీనం.. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపిన శంకర్ పల్లి పోలీసులు..



**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్ పల్లి పోలీసులు పక్కా సమాచారంతో మంజీరా పైప్ లైన్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహించగా ముగ్గురు వ్యక్తుల నుంచి 80 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన జరిగింది. సీఐ రుద్వీర్ కుమార్ తెలిపిన సమాచారం ప్రకారం ఈనెల మూడవ తేదీన ముగ్గురు వ్యక్తులు 80 కిలోల గంజాయి తరలిస్తున్నారని తెలుసు కొన్నామని అన్నారు మంజీరా పైప్లైన్ వద్ద మాటు వేసి ఉండగా ఎస్సై సురేష్, పోలీస్ బృందం వీరిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు, కామారెడ్డి జిల్లా పిట్లం కు చెందిన ఎం. శ్రీనివాస్, జె. కిరణ్, ఎం. శ్రీనివాస్ లు గంజాయి తరలిస్తుండగా అరెస్టు చేసి రిమాండ్ కు పంపించామని చెప్పారు. ఒడిశాలోని చిత్రకొండ ప్రాంతం నుండి కిలో రూ. 6000 చొప్పున గంజాయిని కొనుగోలు చేసి కర్ణాటకలోని బీదర్లో కిలో గంజాయి రూ.20 వేల చొప్పున విక్రయిస్తున్నారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# పద్మశాలి సేవాసంఘం పాతకేరి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల మహోత్సవం







**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని పాతకేరిలో పద్మశాలి సేవాసంఘం అధ్యక్షుడు చిల్వేరి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగారెడ్డి ఎమ్మెల్యే తనయుడు చింతా సాయినాథ్ చేనేత సహకార సంఘం చింతా గోపాల్, అశోక్, కరుణాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మశాలి కులబాంధవులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని మేకలను బలి ఇచ్చి, వస్త్రాలు సమర్పించి, ఓడి బియ్యాన్నిసమర్పించారు. అనంతరం బోనాలను దుర్గాభవాని ఆలయం వరకు డప్పు చప్పుళ్ళ, వేళతాళాలు, వాయిద్యాలుఆటపాటల నడుమ భారీ ఊరేగింపుగా తీసుకెల్లి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ న్యాలం అర్జున్ ఫణిక్రిష్ణ, పద్మశాలి సేవాసంఘం అధ్యక్షుడు చిల్వేరి రవి, ప్రధాన కార్యదర్శి కొంగరి ప్రభు, ఉపాధ్యక్షుడు మేకల జనార్ధన్, ప్రచార కార్యదర్శి సోమ శంకర్, ముఖ్య సలహాదారులు చిల్వేరి వెంకటేశం, రుమాండ్ల రాజు, నెల్లి క్రిష్ణ, మధునాల శివాజి, అమృతం స్వామి, బిజ్జరాజు, కార్యవర్గ సభ్యులు పద్మ మాణిక్యం,మాదాసు రాజు, పరమదాసు, జగన్నాథం, కొంగరి నర్సింలు, ఇమ్మడిశెట్టి గోపాల్ తదితరులు, పద్మశాలి కులబాంధవులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## తార్నాక ఎంఎంసి కార్యాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాల్లో తడురీ శ్రీనివాస్..





**ఉప్పల్ జోనల్ వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఎంఎంసి కమిషనర్ కార్యాలయం లో తెలంగాణ సంప్రదాయ బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాదూరి శ్రీనివాస్ పూజా కార్యక్రమం లో పాల్గొన్నారు. మరియు ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి తార్నాకలోని మల్కజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ హెడ్ క్వార్టర్స్ సిబ్బంది మరియు బిఎంఎస్ యూనియన్ నాయకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు, బోనాల పండుగ ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఘనంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధికార ప్రతినిధి తెలంగాణ మొదటి మాజీ ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ తాదూరి శ్రీనివాస్, అలాగే ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిల్కానగర్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ గోనె శ్రీకాంత్ ముదిరాజ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బీజేపీ ఓ బి సి మోర్చా సెక్రటరీ రత్నపురం వెంకటేశ్వర్లు, ఏ ఎస్ రావు నగర్ డివిజన్ సీనియర్ నాయకులు ఏనుగు సీతారాం రెడ్డి, అలాగే పలువురు బి ఎం ఎస్ యూనియన్ నాయకులు, కార్మికులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియంహైస్కూల్‌లలో సబ్జెక్టు ఉపాధ్యాయులను వెంటనే నియమించాలి ఎం.డి మొయిజుద్దీన్



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి కేంద్రం ఆల్‌ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విద్యాశాఖాధికారి (ణజూ)ను ఉర్దూ మీడియం హైస్కూల్‌లలో ఖాళీగా ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయుల పోస్టులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ విధానం ద్వారా తక్షణమే భర్తీ చేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలోని అనేక ఉర్దూ మీడియం హైస్కూల్‌లలో గణితం, సైన్స్, ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ మరియు ఇతర సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. దీని వల్ల విద్యార్థుల బోధన ప్రభావితమవుతోందని, విద్యా సంవత్సరం వేగంగా కొనసాగుతున్నందున ఆలస్యం జరిగితే విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వార్షిక ఫలితాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని మండల విద్యాశాఖాధికారుల ఎంఈఓ నుండి అవసరమైన వివరాలను సేకరించి, అత్యవసరంగా అవసరమున్న ఉర్దూ మీడియం హైస్కూల్‌లకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా సబ్జెక్టు ఉపాధ్యాయులను వెంటనే కేటాయించాలని ఆయన జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఈ అంశంపై విద్యాశాఖ తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి సానుకూలంగా స్పందించారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794